క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



కడప ఎడ్యుకేషన్ : ఎస్టీయూ కడప నగర శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎస్టీయూ క్యాలెండర్-2024ను జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కడప నగర పాలక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్‌బాషా, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మాకర్, రీజినల్ కన్వీనర్ అబ్దుల్‌వాజిద్, నగర అధ్యక్షులు సాదిక్‌అలీ, ఆర్థిక కార్యదర్శి అస్లాం, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఆపస్ ఆధ్వర్యంలో..



కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్)–2024వ సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్, డైరీని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డిలు ఆపస్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఆపస్ రాష్ట్ర సహాధ్యక్షులు రామమోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్రకార్యవర్గ సభ్యులు వెంకటరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ నేతృత్వంలో..




కడప ఎడ్యుకేషన్ : కడపలోని మట్టి పెద్దపులిలో షో సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆ కౌన్సిల్ నగర అధ్యక్షుడు లయన్ ఫటాన్ ఖాదర్‌బాషా, సభ్యులు హబీబ్‌సలీం, సుబ్బరాయుడు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డైరీ ఆవిష్కరణ



కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల పొదుపు పరపతి సహకార సంఘం లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో 2024 సంవత్సర డైరీని ఆవిష్కరించినట్లు సీసీఎస్ డెలిగేట్స్ సగినాల శ్రీనివాసులు, కేఆర్ఎస్ రెడ్డి తెలిపారు. శనివారం కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నూతన సంవత్సర డైరీని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీకి సంబంధించిన అన్ని అంశాలు డైరీలో పొందుపరచడం అభినందనీయమన్నారు. అధికారులు, ఉద్యోగులు డైరీని పొంది సంస్థకు సంబంధించిన అంశాలను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు జయరాం, మూర్తి, సుబ్బయ్య, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



ఉరి తాళ్లు మెడలో వేసుకొని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్ : మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 5వ రోజుకు చేరుకుంది. శనివారం కార్మికులు ఉరి తాళ్లు మెడలో వేసుకొని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమ్మెను ఉధ్రుతం చేసిన కార్మికులు పాత మునిసిపల్ ఆఫీస్ వద్ద తెల్లవారుజాము నుంచి వాహనాలను అడ్డుకొని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షుడు సుంకర రవి, నాయకులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

పులివెందుల టౌన్ : స్థానిక నూతన ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం పునఃనిర్మాణానికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.80 లక్షల ప్రభుత్వ నిధులతోపాటు రూ.20 లక్షల భక్తుల సహకారంతో దేవాదాయ, ధర్మదాయ శాఖల ఆధ్వర్యంలో ఆలయ పునఃనిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆంజనేయస్వామి గర్భాలయంలోని విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో కొలువు తీర్చారు. అనంతరం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు రామ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించి ఆలయ జీర్ణోద్ధరణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మదాయ శాఖ డీఈ గంగయ్య, హిందు ధర్మప్రచార సమితి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సృష్టికి ప్రతిసృష్టికర్తలు చిత్రకారులు



సమావేశంలో మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : సృష్టికి ప్రతిసృష్టికర్తలు చిత్రకారులు అని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూ లలితకళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు ఆధ్వర్యంలో 'జీవన సంప్రదాయాలు' మ్యూరల్ పెయింటింగ్‌పై ఐదు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ చిత్రకారులు కావాలన్న ఒక ఉన్నత ఆశయంతో కోర్సులో ప్రవేశాలు పొంది ఉంటారని, ఆ ఆశయాన్ని నెరవేర్చుకోవాలన్నారు. వర్క్‌షాప్‌లో నిపుణుల ద్వారా పొందిన నైపుణ్యాలను ప్రొఫెషనల్ ఆర్టిస్టులుగా తయారయ్యేందుకు వినియోగించుకోవాలని సూచించారు. ఫైన్‌ఆర్ట్స్ విభాగానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో విద్యార్థులు గోడలపై గీచిన 16, 32 అడుగుల చిత్రాలు విశ్వవిద్యాలయానికే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. వర్క్‌షాప్ డైరెక్టర్ డాక్టర్ కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ వర్క్‌షాప్ విజయవంతమైందన్నారు. రీసోర్స్ పర్సన్‌లు పి.సంతోష్‌కుమార్, కె.రవిలు మాట్లాడుతూ వర్క్‌షాప్, నైపుణ్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ సమన్వయకర్తలు సి.వెంకటేష్, బి.చినరాయుడు, బి.ఈరప్ప, ఎం.వాసవి, కె. రెడ్డిశేఖరరెడ్డి, సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లుగా స్థిరపడాలి



శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులతో అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా కడప డిపోలో హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పొందిన డ్రైవర్లు వృత్తిలో స్థిరపడాలని ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం 18వ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ఇప్పటి వరకు కడప డిపోలో 18 బ్యాచ్‌ల ద్వారా 300 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రస్తుతం 19వ బ్యాచ్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు గంట పాటు వాహనంలోని వివిధ విభాగాల పనితీరు, రోడ్లపై ఉండే మార్కింగ్‌లు, రోడ్డు పక్కనగల సైన్ బోర్డులు, సిగ్నల్స్ గురించి వివరంగా నిపుణులచే అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎం డిల్లీశ్వరరావు, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముగ్గుల పోటీ

కడప కల్చరల్ : కడప రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ముగ్గుల పోటీ నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు పద్మప్రియ చంద్రారెడ్డి, కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. సంక్రాంతి సంబరాలు 2024లో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. నగర పరిధి ఎర్రముక్కపల్లెలోని శివశివానీ స్కూలు మైదానంలో స్త్రీలకు ముగ్గుల పోటీ నిర్వహిస్తామన్నారు. గంట సమయంలో 4.5 అడుగుల పొడవు, వెడల్పులో ముగ్గు వేయాల్సి ఉంటుందన్నారు. విజేతలకు రూ.10,000, రూ.7500, రూ.5000తోపాటు ఐదుగురికి చీరలను బహుమతిగా ఇవ్వనున్నట్లు వివరించారు.

3 నుంచి లింబ్ ఫిట్‌మెంట్ శిబిరం

ప్రొద్దుటూరు : బెంగళూరు నగరంలో రోటరీ క్లబ్ పీణ్యా వారి ఆధ్వర్యంలో జనవరి 3వ తేదీ నుంచి 9 వరకు మెగా లింబ్ ఫిట్‌మెంట్ క్యాంప్(అవయవ అమరిక శిబిరం) నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రోటరీ బెంగళూరు పీణ్యా, శ్రీభగవాన్ మహావీర్ వికలాంగ సాహిత్య సమితి జైపూర్ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కృత్రిమ కాళ్లు, చేతులు, పోలియో బాధితులకు కాలిపర్స్ ఉచితంగా అందిస్తామని వివరించారు. అవసరమైన వారు జనవరి 2వ తేదీలోపు ప్రొద్దుటూరులోని రోటరీ క్లబ్‌లో ఆధార్ కార్డు జిరాక్స్ ఇచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా దర్గా గురువుల జయంతి

కడప కల్చరల్ : విశ్వవిఖ్యాత ధార్మిక సంస్థ కడప పెద్దదర్గా 10వ పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా అమీన్‌పీర్ సాహెబ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం కడప నగరంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంర్భంగా దర్గా ప్రతినిధులు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో గురువుల పేరిట భారీ కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. దాదాపు 800 మంది విద్యార్థులకు నిర్వాహకులు పండ్లు, కేక్‌లు, స్వీట్లు, చాక్లెట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కడప నగరంలోని అన్ని అనాథ బాలల శరణాలయాలు, పేదలు, అనాథలు, వృద్ధుల శరణాలయాల్లో పండ్లు, కేకులు, బిస్కెట్లు, బ్రెడ్లు పంచి పెట్టారు. దర్గా ప్రతినిధులు రిమ్స్ ఆస్పత్రితోపాటు నగరంలోని మరికొన్ని ఆస్పత్రుల్లో పేదలకు ఆహార పదార్థాలు, పండ్లు, బ్రెడ్లు అందజేశారు. దర్గా ప్రతినిధులు బృందాలుగా వెళ్లి నిరుపేదలు, యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమిపూజ



బ్రిడ్జి నిర్మాణ పనుల భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని రింగ్‌రోడ్డు వైపు నుంచి పబ్బాపురం మధ్యలో వున్న వాగుపై నిర్మించే నూతన బ్రిడ్జి నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి భూమిపూజ చేశారు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పబ్బాపురం పంచాయతీలో పర్యటించినప్పుడు పంచాయతీ ప్రజలు రింగ్ రోడ్డు వైపు నుంచి పబ్బాపురం గ్రామానికి వచ్చేందుకు వాగు అధికంగా ప్రవహించిన సమయంలో అన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని ఆయనకు వివరించారు. స్పందించిన ఆయన ఎంపీ నిధుల కింద రూ.56 లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగుతున్నదని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి నెరవేరుస్తూ ముందుకు సాగుతున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను ఇచ్చిన మాట ప్రకారం కుల మత పార్టీలకు అతీతంగా ప్రతి వర్గానికి మేలు జరిగే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించారన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఎన్ని కుతంత్రాలు కుయుక్తులు చేసిన ప్రజలందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కడతారన్నారు. కార్యక్రమంలో కడప నగర డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, సర్పంచ్ సగిలి లక్ష్మీదేవి, సగిలి గంగాధర్‌రెడ్డి, ఎంపీటీసీ సగిలి నారాయణరెడ్డి, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, రఘురామిరెడ్డి, చిన్న సుబ్బరాయుడు, పెద్ద సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : స్థానిక సరస్వతీ నగర్‌లో రూ.45 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు భూమిపూజ చేయడానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆదివారం రానున్నారని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. మండల నాయకులు, వైఎస్సార్‌సీపీ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని వారు తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక హోమస్‌పేట ప్రాథమిక పాఠశాలలో 4, 5వ తరగతుల విద్యార్థులకు శనివారం విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు శేషిరెడ్డి ఆధ్వర్యంలో గణిత, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శేషిరెడ్డి కుమారుడు కొండారెడ్డి, కోడలు నళిని, ప్రధానోపాధ్యాయుడు రవీంద్రుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు నగర శివారులోని సింగపూర్ టౌన్‌షిప్‌లో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు సిరిగిరెడ్డి రామమునిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగపూర్ టౌన్‌షిప్‌లోని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చెప్పలి రాజారావు, సింగపూర్ టౌన్‌షిప్ ప్రెసిడెంట్ బండి రాఘవరెడ్డి, సెక్రటరీ మల్లికార్జునరెడ్డి, ఈసీ సభ్యులు మల్లికార్జునరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బుడ్డా వెంగళరెడ్డి వర్ధంతి సభ

కడప సెవెన్‌రోడ్స్ : రేనాటి చంద్రునిగా, అపర కర్ణునిగా పేరుగాంచిన ఉయ్యాలవాడకు చెందిన బుడ్డా వెంగళరెడ్డి 123వ వర్ధంతి సభ ఆదివారం ఉదయం 10 గంటలకు కడప వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 1866లో రాయలసీమలో భయంకరమైన కరువు సంభవించి వేలాది మందిని పొట్టన పెట్టుకుందని తెలిపారు. ఆ సమయంలో వేల మందిని అక్కున చేర్చుకుని మూడు నెలలపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించి ప్రాణాలు కాపాడిన ఘనత బుడ్డా వెంగళరెడ్డిదేనన్నారు. ఆయన దాతృత్వానికి మెచ్చి ఆనాటి బ్రిటీషు విక్టోరియా మహారాణి బంగారు పతకాన్ని మద్రాసు ప్రెసిడెన్సీ గవర్నర్ ద్వారా ఆయనకు ప్రదానం చేశారని వివరించారు. అలాంటి మహనీయుని వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేస్తున్న సభలో సీపీఐ, సీపీఎం, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ, ఏపీ రెడ్డి సంఘం, కాంగ్రెస్, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారన్నారు. వివిధ వర్గాల ప్రజలు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

రాజుపాళెం : మండలంలోని పర్లపాడు గ్రామానికి చెందిన డేరంగుల బాలనరసింహులు అక్రమంగా అమ్ముతున్న 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజగోపాల్ శనివారం తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఇంటింటికీ అయోధ్య శ్రీరాముడి అక్షింతలు



శ్రీరాముని అక్షింతలను పంపిణీకి సిద్ధం చేస్తున్న భక్తులు

బద్వేలు అర్బన్ : భవ్య రామమందిర నిర్మాణం పూర్తవుతున్న నేపథ్యంలో శ్రీరాముడిని పూజించిన అక్షింతలు ప్రతి హిందువు ఇంటికి అందజేయనున్నట్లు విశ్వహిందూ పరిషత్ కన్వీనర్ రామకోటిరాజు, అధ్యక్షులు కొండపల్లి వెంకటసుభాష్‌లు తెలిపారు. 5 రోజుల క్రితం బద్వేలుకు చేరుకున్న అక్షింతలను ఇంటింటికి అందించేందుకు వీలుగా శనివారం స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్యాకెట్లను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో జరిగే శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి ముందుగానే పట్టణంలోని ప్రతి ఇంటికి అక్షింతలతో పాటు శ్రీరాముని ఫొటో అందజేయడం జరుగుతుందని తెలిపారు. అబ్బుసాహెబ్‌పేట గ్రామంలో అయోధ్య శ్రీరాముని అక్షింతల శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని బెస్తవీధి, కాపువీధిలలో రమేష్‌బాబు ఆధ్వర్యంలో అక్షింతల శోభాయాత్ర నిర్వహించి అక్షింతలు పంపిణీ చేశారు.

నూతన కార్యవర్గం



జిల్లా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కార్యవర్గం

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైఎస్సార్ జిల్లా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా నూతన కార్యవర్గం శనివారం నియామకమైంది. కడప జిల్లా అధ్యక్షుల చేతుల మీదుగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎస్.ఇంతియాజ్ అహ్మద్, కోశాధికారిగా కపిల్, సంయుక్త కార్యదర్శిగా కాలేషా, డాక్టర్ ఫరీద్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ అధ్యక్షులు ఎస్ఎండీ ఇబ్రహీం మాట్లాడుతూ మానవ హక్కులను కాపాడటం అందరి బాధ్యతగా భావిస్తూ ఇందుకోసం జిల్లా కమిటీ పని చేస్తుందని తెలిపారు. ప్రజలు తమ హక్కుల కోసం కడప నగరం రహమతుల్లా వీధిలోని కౌన్సిల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు

రామయ్య సన్నిధిలో డీఆర్‌డీఏ పీడీ

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో ఏకశిలపై వెలసిని సీతారామలక్ష్మణులను శనివారం వైఎస్సార్ జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్ కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ లాంచనాలతో వారికి స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షణ కావించి, గర్భాలయంలోని మూల విరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు రంగమండపంలో సేదతీరి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కళాశాలకు స్పోర్ట్స్ కిట్స్ వితరణ

సింహాద్రిపురం : స్థానిక ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలకు శనివారం బెంగుళూరు శ్రీస్కంద ఇంజనీరింగ్ కళాశాల ఎండీ జె.చంద్రశేఖర్ రూ.25వేలు విలువ చేసే టేబుల్ టెన్నిస్ బాల్, బ్యాట్స్, 4 వాలీబాల్స్, 3 జావెలిన్ స్టిక్స్, 2 డిస్కస్ త్రో స్పోర్ట్స్ కిట్లతోపాటు 2 ఎయిర్ పంప్‌లను వితరణగా అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తాతాజీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు శ్రీఓబులేసుస్వామి కల్యాణం

వేంపల్లె : లక్కిరెడ్డిపల్లె మండలం కోనంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని బి.ఎర్రగుడి గ్రామంలో వెలసిన శ్రీఓబులేసుస్వామి ఆలయంలో సోమవారం స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వేంపల్లె శ్రీచైతన్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్, మానవత స్వచ్ఛంద సంస్థ మండల చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. టీటీడీ దేవస్థానం నుంచి ఆగమ పండితులు అశోకాచార్యులు, మోహన్‌కృష్ణల బృందంచే అభిషేకాలు, అలంకరణలు ఉంటాయన్నారు.

12 నుంచి ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జనవరి 12, 13 తేదీల్లో కర్నూలులో ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఎస్టీయూ ఆవిర్భవించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవాల పోస్టర్లను శనివారం కడప ఎస్టీయూ భవన్‌లో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో ఉద్భవించిన ఘన చరిత్ర కలిగిన సంఘం ఎస్టీయూ అని అన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమమే ధ్యేయంగా ఆవిర్భవించి, నాటి నుంచి నేటి వరకు ఎన్నో ఉద్యమాలకు సారథ్యం వహించి ముందుండి పోరాడిన సంఘం ఎస్టీయూ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య, రాష్ట్ర నాయకులు బాలగంగిరెడ్డి, గురుకుమార్, ఇలియాస్‌బాషా, సురేష్‌బాబు, నరసింహారెడ్డి, జయరామయ్య, సంగమేశ్వరరెడ్డి, శివారెడ్డి, పాలకొండయ్య, రాధాక్రిష్ణమూర్తి, ఓబన్న, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 2023 జూలై నుంచి వర్తించే విధంగా మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ వేతన సవరణ సంఘం కమిషన్ ఏర్పాటు చేసినా, ఇంత వరకు బాధ్యతలు చేపట్టలేదన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ త్వరగా వచ్చే అవకాశం ఉంది కాబట్టి వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ ఖాదర్‌బాషా, శ్రీనివాసులరెడ్డి, గురయ్య, జిల్లా కార్యదర్శులు రాంభూపాల్‌రెడ్డి, సుబ్బయ్య, జిల్లా కౌన్సిలర్ మణికుమార్, పూర్వ అధ్యక్షుడు చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశాలను ఉద్యోగులుగా గుర్తించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని ఆశా కార్యకర్తలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి పేర్కొన్నారు. శనివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న నిరసనలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు సుజాత, నారాయణమ్మ, దేవి, సరళ, బేబీ, మిడుతూరు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బాలికా దినోత్సవంపై వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎంఈఓ రవిశంకర్

చాపాడు : జనవరి 24న జాతీయ బాలిక దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్థానిక మండల రీసోర్స్ కార్యాలయంలో శనివారం సేవ్ ద గర్ల్ చైల్డ్ నారమ్స్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ద పీసీ అండ్ పీఎన్‌డీటీ అక్ట్ పై మూడు అంశాలలో మండలంలోని హైస్కూల్ విద్యార్థిలకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పెయింటింగ్ విభాగంలో చాపాడు హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని బి.నాగవేణి, డిబెట్‌లో కస్తూర్బాకు చెందిన 10వ తరగతి విద్యార్థిని రాజేశ్వరి, వ్యాస రచనలో 9వ తరగతి విద్యార్థిని జి.నందిని ప్రథమ స్థానంలో గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థినిలకు మండల విద్యాధికారులు రవిశంకర్, వంశీకృష్ణ బహుమతులు అందజేశారు. గెలుపొందిన విద్యార్థినిలు ఈ నెల 24న కడపలో జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనాలని ఎంఈఓ రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రైస్కూటర్ వితరణ



మాబుచాన్‌కు తాళాలు అందజేస్తున్న సీవీ సుబ్బారావు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో శనివారం సంస్థ ఆధ్వర్యంలో నార్త్ అమెరికా లాస్ ఏంజెల్స్ రాయలసీమ అసోసియేషన్ సహకారంతో అమృతానగర్‌కు చెందిన మాబుచాన్ అనే దివ్యాంగురాలికి రూ.1.50 లక్షల వ్యయంతో ట్రై స్కూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ మాట్లాడుతూ తన చిన్ననాటి మిత్రురాలు పూజ, ఆమె భర్త రాము, లాస్‌ఏంజెల్స్ రాయలసీమ అసోసియేషన్ సహకారంతో ట్రై స్కూటర్‌ను వితరణగా అందించామన్నారు. మాబుచాన్‌కు సంస్థ గౌరవాధ్యక్షుడు సీవీ సుబ్బారావు తాళాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మాధవ, సహాయకార్యదర్శి సాయి, అమరావతి శ్రీకాంత్, సుధాకర్‌రెడ్డి, మల్లికార్జున, శేఖర్, విజయ, మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణువర్దన్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కలసపాడు : స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం పురోహితులు వారణాసి వెంకటరమణయ్య అర్చకత్వంలో కుంకుమార్చన, గోపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు భజన మండలి వారిచే భజనలు, ధర్మ ప్రచార మండలి సభ్యులు తుపాకుల శ్రీనివాసులుచే రామాయణ, మహాభారత, భగవద్గీతపై ప్రవచనాలు నిర్వహించారు. సందర్భంగా కడప జిల్లా శాఖ నిర్వాహకులు గోపిబాబు మాట్లాడుతూ పవిత్ర ధనుర్మాసం మార్గశిర మాసంలో శ్రీహరి నామస్మరణ మోక్షదాయం, మంగళకరమన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హింధూ ధర్మ పరిరక్షణ సమితి ఎన్నిక

స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం జరిగిన అయోధ్య శ్రీరామ అక్షింతల పంపిణీ కార్యక్రమంలో కలసపాడు మండల హిందూ ధర్మ పరిరక్షణ సమితిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాతా శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.బాలగురయ్య, ఉపాధ్యక్షుడిగా రామలక్షుమయ్య, అర్థిక కార్యదర్శిగా రామాంజనేయరెడ్డిలను ఎన్నుకున్నారు.